సాక్షి
కర్నూలు
ఆదివారం । 19 । మార్చి । 2023



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం హైదరాబాద్ రాగరమ్య అకాడమీ కళాకారుల సంప్రదాయ నృత్యం అలరించింది.



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి శనివారం కోనసీమ జిల్లాకు చెందిన కొవ్వూరి శ్రీనివాస రెడ్డి రూ.1,60,450 విరాళంగా ఇచ్చారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	22.5
గరిష్టం	32.5

న్యూస్‌రీల్

24 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పంపై శిక్షణ



టీ నాగరాజునాయుడు, డీపీఓ

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జగనన్న స్వచ్ఛ సంకల్పంలోని ప్రధాన అంశాలపై ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పత్తికొండ, లద్దగిరి, హెచ్.మురవణి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల వద్ద ఎంపిక చేసిన వారికి ఒక రోజు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన రెండు మోడల్ గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచు, ఉప సర్పంచు, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, షెడ్ మిత్ర, క్లాప్ మిత్ర, ఈఓఆర్‌డీ, ఎంపీడీఓలకు డీఎల్‌పీఓల ఆధ్వర్యంలో శిక్షణనిస్తామని డీపీఓ వివరించారు.

మూడు మండలాల్లో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని మూడు మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆస్పరిలో 13.4, దేవనకొండలో 5.4, కృష్ణగిరిలో 4.4 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. రెండు రోజుల్లో జిల్లా మొత్తం మీద 4.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురిసిన అకాల వర్షాలతో మొక్కజొన్న 1,257.36, ఆముదం 93.99 ఎకరాల్లో దెబ్బతిన్నట్లుగా వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలు 26.90 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. రానున్న 24 గంటల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు ప్రకటించారు.

999 మంది విద్యార్థులు గైర్హాజరు

కర్నూలు కల్చరల్: జిల్లా వ్యాప్తంగా 123 కేంద్రాల్లో ఇంటర్మీడియేట్ పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం జరిగిన పరీక్షలకు 32,481 మంది విద్యార్థులకు గాను 999 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి వెల్లడించారు. 29 పరీక్షా కేంద్రాలను ఆర్ఐవో, డీఈఐవో, హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించాయన్నారు. గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇద్దరు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతుండటంతో స్క్వాడ్ బృందం డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ- వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల సాగు, వినియోగం పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ 2023 గ్లోబల్ కాన్ఫరెన్స్‌ను ఢిల్లీలో ప్రారంభించారు. కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, అదనపు పీడీ శ్రీధర్‌రావు తదితరులు వీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు రైతు కుటుంబాలకు చెందిన వారేనని, వీరిచేత చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా డయాబెటీస్‌తో పాటు అనేక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆడిషనల్ పీడీ శ్రీధర్‌రావు, డీపీఎం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు మామయ్య దీవెన

- నేడు జగనన్న విద్యా దీవెన విడుదల
- తిరువూరు నుంచి ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 39,312 మంది విద్యార్థులకు చేకూరనున్న ప్రయోజనం
- మూడున్నర ఏళ్లలో తల్లుల ఖాతాల్లోకి రూ.380 కోట్ల జమ

పేదింటి బిడ్డల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. ప్రతి ఏడాది జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తూ విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేస్తోంది. దీంతో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని పలువురు ఉద్యోగాలు సాధించారు. పేదరికాన్ని తొలగించుకుని సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీవెనలతో తమ కుటుంబాల్లో విద్యా వెలుగులు నిండాయని పలువురు విద్యార్థులు చెబుతున్నారు.

కర్నూలు(అర్బన్): పేదరికంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారు. వైఎస్సార్ హయాంలో ఈ పథకం ద్వారా అనేక మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు లబ్ధి పొందారు. ఇంజినీరింగ్, మెడిసిన్ పూర్తి చేసుకున్నారు. వైఎస్సార్ అనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడిచాయి. ఫీజులు చెల్లించలేక కొందరు విద్యార్థులు మధ్యలోనే చదువులను ఆపివేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి ఆదివారం ఈ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించనున్నారు.



సామాజిక వర్గాల వారీగా విద్యార్థులకు విడుదల కానున్న మొత్తం ...

సామాజిక వర్గం	మొత్తం విద్యార్థులు	తల్లులు	విడుదల కానున్న మొత్తం
ఎస్సీ	9,481	8,485	రూ.7,72,82,345
ఎస్టీ	691	596	రూ.40,29,358
బీసీ	21,116	19,164	రూ.11,33,61,271
ఈబీసీ	2,111	1,940	రూ.1,71,96,037
ముస్లిం మైనారిటీ	5,006	4,515	రూ.2,61,40,116
కాపు	781	750	రూ.50,19,817
క్రిస్టియన్ మైనారిటీ	126	111	రూ.8,60,218
మొత్తం	39,312	35,561	రూ.24,38,89,162

35,561 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.24.38 కోట్లు

2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత జగనన్న విద్యా దీవెన నిధులు ఆదివారం విడుదల కానున్నాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన 39,312 మంది విద్యార్థినీ, విద్యార్థులకు చెందిన 35,561 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.24,38,89,162 జమ కానున్నాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభ దశలోనే విద్యా దీవెన నిధులు విడుదల కానుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలకు ప్రతి ఏడాది ఖచ్చితంగా నిధులు విడుదలవుతూ వస్తున్నాయి. 2019–20 నుంచి 2021–22 విద్యా సంవత్సరం వరకు విద్యా దీవెనకు రూ.252,04,31,051, వసతి దీవెనకు రూ.128,35,05,700 వెరసి మొత్తం రూ. 380 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయి.

కళాశాలల్లో నిర్ణీత సమయంలోగా జమ చేయండి



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్న ఫీజు మొత్తాలను సంబంధిత కళాశాలల్లో నిర్ణీత సమయంలోగా చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ముఖ్యంగా అర్హులైన విద్యార్థులందరికీ ఈ పథకం కింద ఫీజులు విడుదలయ్యేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఈ మూడున్నరేళ్లలో విద్యా, వసతి దీవెన కింద మొత్తం రూ.380,39,36,751లను విడుదల చేసింది.

– ఏ నాగేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి

డీబీఎస్‌లో ఉద్యోగం వచ్చింది



జగనన్న విద్యా దీవెన కింద ప్రతి ఏడాది రూ.70 వేలు ఫీజును ప్రభుత్వం విడుదల చేసింది. నయాపైసా ఖర్చు లేకుండా ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన వెంటనే ఏడాదికి రూ.9 లక్షల ప్రకారం డీబీఎస్ (డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్)లో ఉద్యోగం వచ్చింది. నాన్న మల్లికార్జున వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాలాంటి పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన ఎంతో ఉపయోగపడుతోంది.

–సీ మనీషా, నార్లాపురం, వెల్దుర్తి మండలం

పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగం



మాది కోడుమూరు మండలం అనుగొండ గ్రామం. నాన్న అయ్యస్వామి కర్నూలులోని ఓ ప్రైవేటు కళాశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన మేరకు ఆయా కళాశాలలకు మొత్తం ఫీజు చెల్లిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులకు ఎలాంటి భారం లేకుండా ఉన్నత విద్యను పూర్తి చేస్తున్నాం. నాకు ప్రతి ఏడాది రూ.48 వేలు విడుదలవుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతతో మంచి ఉద్యోగం సంపాదించుకుంటాను.

– ఎం అనూష, బీటెక్ ఫైనలియర్, జీ పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల

విద్యార్థులకు ఈకేవైసీ తప్పనిసరి



జగనన్న విద్యా, వసతి దీవెన పొందేందుకు విద్యార్థులు గ్రామ,వార్డు సచివాలయాల్లో, కళాశాలల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. విద్యా దీవెన పొందేందుకు ఏవైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే వాటిని పరిష్కరించేందుకు మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

– ఎస్‌పీఎస్ఎస్ రెడ్డి, ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమ శాఖ

'పది' పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

- మాల్ ప్రాక్టీస్ జరిగితే ఇన్విజిలేటర్లదే బాధ్యత
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండాలి
- చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు కలెక్టర్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): పొరపాట్లకు తావులేకుండా పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయన్నారు. జవాబు పత్రాలను స్పాట్ వాల్యుయేషన్ కేంద్రానికి, ఇతర మెటీరియల్‌ను డైరక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్లదే బాధ్యత అని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, చీఫ్‌సూపరింటెండెంట్లు పర్యవేక్షణ చేస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండేలా చ ర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నపత్రాల ప్యాకెట్ కేవలం 10 నుంచి 15 నిమిషాల ముందు మాత్రమే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్ల సమక్షంలో తెరవాలన్నారు. ప్రశ్నపత్రాలు తక్కువగా ఉంటే ఉన్నతాధికారులకు తగిన సమాచారం ఇచ్చి బఫర్ సెంటర్ నుంచి పొందాలన్నారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ప్రశ్న పత్రాలను జిరాక్స్ చేసి వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్, ఏడీ శ్యామూల్ పాల్, డిప్యూటీ డీఈఓలు హనుమంతరావు, సుకుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో త్రైమాసిక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం 15 రోజులకు ఒకసారి నిర్వహించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం మాట్లాడుతూ..ఇంటి నుంచి పారిపోయిన, తప్పిపోయిన పిల్లల కేసులు, బాలకార్మికుల, బాల్య వివాహాల కేసులను కమిటీ పరిష్కరిస్తుందన్నారు. మూడు నెలల కాలంలో ఏడు కేసులు వచ్చాయన్నారు. ఇద్దరిని పెద్దపాడు పునరావాస కేంద్రానికి, ఒకరిని విజ్ఞాన్ పునరావాస కేంద్రానికి, నలుగురిని డాన్ బాస్కో ఓపెన్ షెల్టర్‌లో ఉంచినట్లు చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఐసీడీఎస్ నుంచి ఇద్దరు ఉద్యోగులను డిప్యుటేషన్ మీద నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఉమామహేశ్వరి, బాలల సంక్షేమ సభ్యులు మురళీకృష్ణ, వెంకటరామయ్య, కార్మిక శాఖ డీసీ పాల్గొన్నారు.

149 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

కర్నూలు కల్చరల్: పదోతరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయని, ఇందు కోసం 149 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ వి.రంగారెడ్డి తెలిపారు. జిల్లాలో 490 పాఠశాలల నుంచి 32,787 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. 11 పరీక్షల కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. 149 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 149 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, 1,664 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలు నిర్వహణలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

'దిశ' ఫిర్యాదులపై వెంటనే స్పందించండి

- పోలీస్‌స్టేషన్ల తనిఖీలో అధికారులకు ఎస్పీ ఆదేశం

కర్నూలు: దిశ యాప్‌కు ఫిర్యాదులు వస్తే సత్వరమే స్పందించాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలోని వన్ టౌన్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. వాటిని త్వరితగతిన డిస్పోజ్ చేయడానికి కోర్టుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పోలీసు బందోబస్తు, పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదుకు జాతీయ సైబర్ క్రైం పోర్టల్ 1930కి సమాచారం అందించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు శంకరయ్య, తబ్రేజ్, తిమ్మారెడ్డి తదితరులు ఉన్నారు.



సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

5 గంటల పాటు నిలిచిన రైలు

- ప్రయాణికుల ఇబ్బందులు

వెల్దుర్తి: రైల్వే పనుల కారణంగా కాచిగూడ రైలును అధికారులు శనివారం బోగోలు స్టేషన్ వద్ద ఐదు గంటలపాటు ఆపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతకల్లు నుంచి బయలుదేరిన కాచిగూడ రైలు డోన్ దాటి బోగోలు స్టేషన్‌కు శనివారం ఉదయం 8 గంటలకు చేరింది. 8.10 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరాల్సి ఉంది. వెల్దుర్తి సమీపంలో రైల్వే పనుల నేపథ్యంలో రైలును అక్కడే ఆపేశారు. గంటల తరబడి రైలు కదలకపోవడంతో మహిళలు, పిల్లలు, పెద్దలు తీవ్ర అసహనానికి గురయ్యారు. గ్రామానికి స్టేషన్ దూరంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోగోలు స్టేషన్ మాస్టరుతో వాగ్వివాదానికి దిగారు. ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత బోగోలు స్టేషన్ నుంచి రైలు కదిలింది.



బోగోలు స్టేషన్‌లో ఆగిన రైలు

ముగిసిన సోషల్ ఆడిట్

కర్నూలు(అగ్రికల్చర్): రబీ పంటల నమోదుకు సంబంధించి సోషల్ ఆడిట్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. పంటల నమోదు జాబితాలను జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతుల పరిశీలనకు ఉంచారు. కేవలం 43 అభ్యంతరాలు రావడంతో పంటల నమోదు పారదర్శకంగా జరిగినట్లేనన్న భావన వ్యక్తమవుతోంది. వీటిని వీఏఏలు, మండల వ్యవసాయాధికారులు పరిష్కరించి తహసీల్దారుకు అప్‌లోడ్ చేశారు. అక్కడ పరిష్కరించిన తర్వాత తుది జాబితా ఈ నెల 20న ప్రకటిస్తామని అధికార వర్గాలు తెలిపాయి.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల కోడ్ కారణంగా దాదాపు నాలుగు వారాలుగా స్పందన కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు. అయితే ఎన్నికలు ముగియడం, కోడ్ తొలగడంతో మళ్లీ ఈ సోమవారం నుంచి స్పందన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంతో పాటు అన్ని మండల, మునిసిపల్, డివిజన్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1.3 కోట్లు



హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న భక్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.1,03,50,779 వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజు గౌడ శనివారం విలేకరులకు తెలిపారు. అలాగే 56.5 గ్రాముల బంగారం, 16.2 కేజీల వెండి వచ్చినట్లు చెప్పారు. గత నెలకు సంబంధించి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను డార్మెటరీ హాల్‌లో లెక్కించగా ఈమేరకు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఏపీ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


రాష్ట్ర జట్టుకు ఎంపికైన రమేష్, విజయ్

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ ఫుట్‌బాల్ జట్టుకు కర్నూలు నగరానికి చెందిన ఇరువురు ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్నూలు డిగ్రీ కళాశాల ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్, సచివాలయ ఉద్యోగి ఎం.విజయ్‌లు ఎంపిక కాగా, వీరిని ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు రాజశేఖర్ శనివారం అభినందించారు. వీరు ఈ నెల 18 నుంచి 23 వరకు ఒరిస్సాలోని కళింగ క్రీడామైదానంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఫుట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మండలం బాలాజీ నగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు కుమార్తె గాయత్రి(17) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నారాయణ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. తల్లి హేమలత గుర్తించి కుటుంబ సభ్యుల సహాయంతో ఉరి నుంచి తప్పించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందింది. పరీక్షల ఒత్తిడి కారణంగానే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నెకు చెందిన దేవయాని అనే గర్భిణికి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. దీంతో మండల కేంద్రం నుంచి వాహనం గ్రామానికి చేరుకుంది. 108 సిబ్బంది శీను, రాజు గర్భిణినితో పాటు ఆశా కార్యకర్తలతో కలిసి వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి బయలుదేరారు. అయితే కొద్ది దూరం వెళ్లగానే నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది వాహనాన్ని పక్కకు నిలిపివేసి ఆశాల సహాయంతో అక్కడే ప్రసవం చేశారు. దేవయాని మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ఆమె కుటుంబసభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3497	రూ. 7545
పొద్దుతిరుగుడు	రూ. 3659	రూ. 4899
ఆముదం	రూ. 5489	రూ. 6059
ఉల్లి	రూ. 300	రూ. 760
ఎండు మిర్చి	రూ. 10501	రూ. 48699
శనగలు	రూ. 3809	రూ. 4611
కందులు	రూ. 3000	రూ. 8030
మొక్కజొన్న	రూ. 1901	రూ. 2030
మినుములు	రూ. 6819	రూ. 6950

పన్ను చెల్లించకుండానే రయ్..రయ్!

- త్రైమాసిక పన్ను చెల్లించని వాహనాలు 1500కు పైగానే
- ఉమ్మడి జిల్లాలో పేరుకు పోతున్న బకాయిలు
- విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్న అధికారులు
- వసూళ్లపై ప్రత్యేక దృష్టి. మెసేజ్‌లతో హెచ్చరికలు


పన్ను వసూలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

2022-23 ఆర్థిక సంవత్సరానికి రెండు జిల్లాలకు ఇచ్చిన లక్ష్యం, వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో)...

	జీవిత పన్ను	మూడు నెలల పన్ను	ఫీజులు	తనిఖీలు	యూజర్ చార్జీలు	మొత్తం లక్ష్యం
కర్నూలు	181.39	88.00	24.7	11.39	7.26	312.75
వసూలైన మొత్తం	82.14	31.72	11.67	14.47	2.63	142.63
నంద్యాల లక్ష్యం	116.00	57.00	-	9.00	-	200.00
వసూలైన మొత్తం	50.00	31.00	-	8.00	-	101.00

కర్నూలు: నిబంధనల ప్రకారం వాహనం రోడ్డు ఎక్కాలంటే పన్ను చెల్లించాలి. అయితే చాలా మంది పన్ను చెల్లింపులో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పన్ను చెల్లించకుండానే వాహనాలను వాణిజ్య, వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా త్రైమాసిక పన్ను చెల్లించని వాహనాలు సుమారు 1500 పైగా ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు గుర్తించారు. వీటిలో ఎక్కువగా ట్రాక్టర్లు, మ్యాక్సీ క్యాబ్‌లు, ఇతర వాహనాలు ఉన్నాయి. నిబంధనల మేరకు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులు ఉమ్మడి జిల్లాలో రూ.79.72 కోట్ల వరకు పేరుకుపోయాయి. ఏడాదిలో నాలుగుసార్లు పన్నులు చెల్లించాల్సి ఉన్నా కొందరు ఏళ్ల తరబడి పట్టించుకోకుండా తప్పించుకుతిరుగుతున్నారు. తాజా తనిఖీల్లో కొందరు వాహనదారులు 2010 నుంచి పన్నులు చెల్లించడం లేదని తేలింది. వాహన రకం, వినియోగించే పనిని బట్టి పన్ను ముందస్తుగానే చెల్లించాలన్నది నిబంధన. నిర్ణీత తేదీ దాటితే జరిమానా విధించవచ్చు.

బకాయిల వసూలే లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు రవాణా శాఖ కార్యాలయాలు, రెండు చెక్‌పోస్టులు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో పది మంది ఎంవీఐలు, ముగ్గురు ఏఎంవీఐలు, నంద్యాల జిల్లాలో నలుగురు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఏఎంవీఐలు విధులు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లో అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు 9 లక్షల వరకు ఉన్నట్లు ఆర్‌టీఏ అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ నిత్యం ఉమ్మడి జిల్లా రహదారులపై పరుగులు పెడుతున్నాయి. ఎంతో మంది సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు రవాణా శాఖ అధికారులు గుర్తించి వాటి లెక్క తేల్చేందుకు ఉపక్రమించారు. ఆర్థిక సంవత్సరం నెలాఖరుతో ముగుస్తున్నందున పన్ను బకాయిల వసూలే లక్ష్యంగా చర్యలకు ఉపక్రమించారు. వాహన తనిఖీ కార్యక్రమాలు విస్తృతం చేశారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధిస్తున్నారు. పలుమార్లు జరిమానా విధించినా నగదు చెల్లించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయం...

కర్నూలు జిల్లాకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం రూ.335 కోట్లు. వివిధ పన్నుల రూపేణా రూ.143 కోట్లు సమకూరాయి. నంద్యాల జిల్లాకు లక్ష్యం రూ.200 కోట్లు కాగా రూ.101 కోట్లు సమకూరింది. వాహన చోదకులు కొత్త వాహనాలు కొనుగోలు చేయడం ద్వారా జీవిత పన్ను(లైఫ్ ట్యాక్స్) రూపంలో ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కేటాయించిన మొత్తం లక్ష్యంలో ఈ విభాగానికి రూ.181.39 కోట్లు నిర్దేశించగా కేవలం రూ.82.14 కోట్లు సమకూరింది. ఇందుకు ప్రధాన కారణం గత ఏడాది కంటే 40 శాతం పెట్రోల్ వాహనాల అమ్మకం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రికల్ వాహనాలపై పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వడంతో వాహనదారులు వాటి కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. ఆటోమొబైల్ విక్రయాలు తగ్గడం ఆదాయం సమకూరకపోవడానికి ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. రవాణా శాఖకు అన్నిటికంటే ఎక్కువ తనిఖీలు (ఎన్‌ఫోర్స్‌మెంట్) కీలకం. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనాలను తనిఖీ చేసే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంది. ఈ నెలాఖరు నాటికి నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకునేలా ముందుగానే ప్రణాళిక రూపొందించుకుని నెల రోజులుగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తుండటంతో ఈ విభాగంలో ఆదాయం పెరిగింది. దాడుల (తనిఖీలు) ద్వారా రూ.11.39 కోట్లు లక్ష్యం నిర్దేశించగా రూ.14.47 కోట్లు ఆదాయం సమకూరింది.

బకాయిదారులకు ఫోన్లు, మెసేజ్‌లతో హెచ్చరికలు

సకాలంలో పన్ను చెల్లించాలని బకాయిదారులకు రవాణా శాఖ ఫోన్లు చేసి అడుగుతోంది. మెసేజ్‌లు కూడా పంపుతున్నారు. సమయం లోగా చెల్లిస్తే సరే.. లేదంటే రెట్టింపు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రయాణికులను తరలించే మినీ వ్యాన్లు, కమర్షియల్ ట్రాక్టర్లు, పాత లారీలు, పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. పన్నులు చెల్లించకుండా వాహనాలు తిప్పడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. వివిధ పన్నుల రూపేణా శాఖకు రావలసిన బకాయిలు పెద్ద మొత్తంలో ఉండటంతో వసూలు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. కొన్ని వాహనాలు గ్రామాలు, మండలాలు మాత్రమే తిప్పుకొని ఇళ్ల దగ్గర పెట్టుకుంటున్నారు. అలాంటి వాహనదారుల ఇళ్లకు హోంగార్డులను పంపి బకాయిలను వసూలు చేస్తున్నారు. వాహన సామర్థ్యం (ఎఫ్‌సీ), అనుమతి (పర్మిట్), క్వార్టర్ పన్నులు చెల్లించని వివరాలతో రవాణా శాఖ అధికారులు బకాయిల జాబితాను రూపొందించారు. అధికారులు బృందాలుగా ఏర్పడి మొండి బకాయిలు లక్ష్యంగా తనిఖీలు చేస్తూ వసూలు చేస్తున్నారు.

ఎప్పుడైనా చెల్లించాల్సిందే



రవాణా శాఖకు సంబంధించిన పన్నులు సకాలంలో చెల్లిస్తే మంచిది. ఆలస్యమయ్యే కొద్దీ జరిమానా తప్పదు. పన్ను వసూళ్ల నిమిత్తం ఫోన్‌కాల్, మెసేజ్‌ల ద్వారా అప్రమత్తం చేస్తున్నాం. అప్పటికీ స్పందించకపోతే హోంగార్డులను ఇళ్లకు పంపుతున్నాం. త్రైమాసిక పన్నులు తప్పనిసరిగా చెల్లించాలి. నిర్దేశించిన కాలపరిమితిలో చెల్లించకుంటే రెట్టింపు వసూలు చేస్తాం. అన్ని రకాల పత్రాలు ఉంటేనే వాహనం రోడ్డెక్కాలి. లేదంటే చర్యలు తప్పవు.

– రమేష్, ఆర్‌టీఓ, కర్నూలు

ఇన్‌స్పైర్ మానక్‌లో విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయికి 24 మంది ఎంపిక


విజేతల వివరాలను విడుదల చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు

కర్నూలు కల్చరల్: ఇన్‌స్పైర్ మానక్ జిల్లాస్థాయి ప్రదర్శనలో 24 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో వి.రంగారెడ్డి వెల్లడించారు. విజేతల వివరాలను డీఈవో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఎన్ఐఎఫ్ వారు ఆన్‌లైన్‌లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి 24 మంది విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరికి ఈనెల 23, 24 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్థాయి ప్రదర్శన ఉంటుందన్నారు. సాధు తరుణ్, చాకలి ప్రాణేష్, చాకలి సోమశేఖర్, బన్నూరు రఘునాథ్‌రెడ్డి, కందుకూరి నరేష్, ఆర్.శివ, ఉన్నమ్ సుష్మసాయి, సోంపల్లి జయశ్రీ, పి.శ్రీనివాసులు, తెలుగు మనీశ్వర్, బట్టుకిరణ్, మంగలి హేమలత, ఎమ్.యూనుస్ భాష, గోరుకంటి మధు కిషోర్, ముల్లంగి హస్మిత, జి.వేణుగోపాల్ రెడ్డి, డి.సువర్చల, దాసరి వంశి, ఎమ్. నాగషాయన, రాజ సుహాని, ఎమ్.మహిమకుమారి, ఎ.ఆర్.సాయినాథ్, ఆరంగుల శివకీర్తి, ఎమ్.గుణప్రియలు విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 18 మంది విద్యార్థులు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1,3,5 సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి శనివారం 18 మంది విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 6,486 మందికి గాను 6,003 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 8,985 మందికి గాను 8,064 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎస్‌టీబీసీ డిగ్రీ కళాశాల కేంద్రంలో 5, ఎమ్మిగనూర్ రావూస్ డిగ్రీ కళాశాలలో 3, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఇద్దరు చొప్పున, కోడుమూరు సాయిరామ్ డిగ్రీకళాశాల, శ్రీ వివేకానంద డిగ్రీకళాశాల, గూడూరు ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, పత్తికొండ విజయ సాయి డిగ్రీ కళాశాల, ఆలూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 18 మంది చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

- ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి

నంద్యాల(రూరల్): జిల్లాలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల సంభవించే విద్యుత్ ప్రమాదాలపై రైతులు, విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి శనివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పొలాల్లో ఉండే రైతులు చిన్న పాటి వర్షాలు కురిసే సమయంలో బోర్ల వద్ద ఉండే విద్యుత్ మీటర్లు, స్విచ్‌లు, విద్యుత్ తీగలను తాకరాదన్నారు. పొలాలు, జనవాసాలు తిరిగే ప్రాంతాల్లో వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల కిందకు వెళ్లడం ప్రమాదకరమన్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో గృహాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు తదితర ఎలక్ట్రికల్ వస్తువులను ఆఫ్ చేయడం మంచిది. స్వతహాగా విద్యుత్ మరమ్మతు పనులు చేయరాదని సూచించారు. గ్రామీణ, పట్టణాల్లో విద్యుత్ ప్రమాదాలు సంభవించినా, ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు ఉన్నా, గృహాలపై విద్యుత్ తీగలు వేలాడుతున్నా సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయ లైన్‌మెన్‌కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా వర్షం కురుస్తున్న సమయంలో ఏదైనా విద్యుత్ సమస్యలు తలెత్తినా, సరఫరాలో నిర్లక్ష్యం వహించినా టోల్ ఫ్రీ నంబర్1912కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

ఉత్కంఠకు తెర

ఎట్టకేలకు తేలిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం

- 60 గంటల పాటు కొనసాగిన ఓట్ల లెక్కింపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఉత్కంఠకు తెరపడింది. 60 గంటల సుదీర్ఘ కౌంటింగ్ అనంతరం ఎట్టకేలకు ఫలితం వెలువడింది. రెండో ప్రాధాన్యత ఓట్లు కలసిరావడంతో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. ఆయనకు 7,543 ఓట్ల మెజారిటీ లభించింది. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ సాధించడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి చవిచూశారు. రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లడం, తనకు వచ్చిన ఓట్లలోనూ పెద్దసంఖ్యలో ఇన్‌వ్యాలిడ్ కావడం వెన్నపూస ఓటమికి కారణాలుగా చెబుతున్నారు.

పీడీఎఫ్ ఓట్లే గెలిపించాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ పరస్పర అవగాహనతో పనిచేశాయి. ముఖ్యంగా రెండో ప్రాధాన్యత ఓట్లను పరస్పరం బదిలీ చేసుకున్నారు. ఫలితంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గట్టెక్కగలిగారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు 18వేల పైచిలుకు ఓట్లు లభించాయి. ఆయన ఎలిమినేషన్ సందర్భంగా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించగా.. ఇందులో ఎక్కువగా టీడీపీ అభ్యర్థికే దక్కాయి. దీనివల్లే టీడీపీ గెలిచినట్లు స్పష్టమవుతోంది. బీజేపీ అభ్యర్థి నగరూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓడిపోతామన్న భయంతో టీడీపీ నాయకులు ముందే పీడీఎఫ్ నేతలను బతిమాలి మరీ అవగాహన పెట్టుకున్నారు. ఇది వారికి కలిసొచ్చింది.

సుదీర్ఘంగా కొనసాగిన ప్రక్రియ

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 18వ తేదీ రాత్రి 8 గంటలకు ముగిసింది. మూడు రోజుల పాటు బ్యాలెట్ బాక్సుల మధ్య ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు గడిపారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది స్కూలు ప్రాంగణంలో శనివారం రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా సీనియర్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవింద రెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, సీఐ విజయ్‌భాస్కర్ లాంఛనంగా పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు నందికొట్కూరుకు రావడం అభినందనీయమన్నారు.